
Adb01:Adb01.qxd 6/12/2026 9:58 PM Page 1


# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 13,జూన్ 2026


## హెచ్ఎంఎస్ బాయిబాట పోస్టర్ ఆవిష్కరణ
# భూక్యా పరుశురాం
## ఆధ్వర్యంలో కార్యక్రమం

**కాసిపేట, జూన్ 12, ప్రభాతవార్త:**

కాసిపేట టూ ఇంక్లైన్ గనిపై హెచ్ఎంఎస్ (హింద్ మజ్దూర్ సభ) పోస్టర్‌ను హెచ్ఎంఎస్ నాయకుడు భూక్యా పరశురాం ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూక్యా పరశురాం మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం హెచ్ఎంఎస్ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో హెచ్ఎంఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్మికులు హెచ్ఎంఎస్‌కు మద్దతు ఇచ్చి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. అనంతరం గని ప్రాంతంలో ప్రచార కార్యక్రమం నిర్వహించి కార్మికులకు సంఘం చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు

*** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, జూన్ 12, ప్రభాతవార్త**



ఈ నెల 13వ తేదీన జిల్లాలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయాన్ని డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గిరిజన సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్, ఆలయ ఈ.ఓ. శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఈ నెల 13వ తేదీన ఉదయం జిల్లాలోని దండేపల్లి మండలం శ్రీ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం పునర్నిర్మాణం, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో సింగరేణిలో వైద్య పరంగా విధులు నిర్వహించలేని ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తారని, సాయంత్రం శ్రీరాంపూర్ ఏరియాలో ఓపెన్ కాస్ట్ గనులను పరిశీలిస్తారని, అనంతరం మంచిర్యాల పట్టణంలో శ్రీ విశ్వనాథ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని వేంపల్లి ప్రాంతంలో గల పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాట్లను డిసిపి, మంచిర్యాల శాసనసభ్యులు, ఎ.సి.పి. ప్రకాష్‌లతో కలిసి పరిశీలించారు. తదనంతరం మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్ ను సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిరంతర నిత్యాన్నదానం... కోనప్ప స్ఫూర్తికి నిదర్శనం

*** ఏడు సంవత్సరాలుగా కోనేరు కోనప్ప రమాదేవి దంపతుల సేవ**



**కాగజ్ నగర్, జూన్ 12, ప్రభాతవార్త :**

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అన్నిటికంటే గొప్ప దానమనే మాటను సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆచరణలో నిరూపిస్తున్నారు. ఆయన, శ్రీమతి రమాదేవి దంపతులు నిర్వహిస్తున్న నిత్య అన్నదాన సత్రం విజయవంతంగా ఏడు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఎనిమిదో సంవత్సరంలోకి అడుగుపెట్టింది. గత ఏడు సంవత్సరాలుగా ఒక్కరోజు కూడా విరామం లేకుండా వేలాది మంది నిరుపేదలు, అనాథలు, వృద్ధులు, కార్మికులు, బాటసారులకు ఉచితంగా భోజనం అందిస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, నిరుద్యోగం, కుటుంబ సమస్యలతో పూట గడవడమే కష్టంగా మారిన అనేక కుటుంబాలకు అండగా నిలవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలినాళ్లలో కొద్దిమందితో ప్రారంభమైన అన్నదానం, నేడు ప్రజల సహకారం, దాతల మద్దతుతో విస్తరించి అనేక మందికి ఆశాకిరణంగా మారింది. ఈ సత్రంలో కులం, మతం, ప్రాంతం, రాజకీయ భేదాలకు అతీతంగా ఆకలితో వచ్చిన ప్రతి ఒక్కరికీ సమానంగా భోజనం అందిస్తున్నారు. రోజువారీ కూలీలు, వృద్ధులు, అనాథలు, ఆసుపత్రులకు వచ్చిన రోగుల బంధువులు, దూర ప్రాంతాల బాటసారులు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలు ఈ సేవ ద్వారా లబ్ధి పొందుతున్నాయి. భోజనం అందించడమే కాకుండా వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించడం, వారి సమస్యలను తెలుసుకోవడం, ధైర్యం చెప్పడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలుస్తోంది. దీంతో ఈ అన్నదాన సత్రం కేవలం భోజన కేంద్రంగా కాకుండా, అవసరంలో ఉన్నవారికి భరోసా కల్పించే సేవా వేదికగా గుర్తింపు పొందింది. ప్రజాప్రతినిధిగా ఉన్న సమయంలో అభివృద్ధి కార్యక్రమాలతో సేవలందించిన కోనప్ప, ప్రస్తుతం కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. పేద విద్యార్థులకు సహాయం, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండ, వివిధ సేవా కార్యక్రమాలతో పాటు నిత్య అన్నదానాన్ని అత్యంత ప్రాధాన్యంగా కొనసాగిస్తున్నారు."ఆకలి తీర్చడం అంటే కేవలం అన్నం పెట్టడం మాత్రమే కాదు.. ఒక మనిషిలో జీవితంపై నమ్మకాన్ని పెంచడం కూడా" అనే భావనతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. ఏడు సంవత్సరాల కాలంలో వేలాది మంది ఈ అన్నదాన సత్రం ద్వారా ప్రయోజనం పొందడం విశేషం. స్థానిక ప్రజలు, దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు కూడా తమ వంతు సహకారం అందిస్తూ కార్యక్రమానికి అండగా నిలుస్తున్నారు. మానవత్వం, సేవాభావం, దాతృత్వానికి ప్రతీకగా నిలిచిన ఈ నిత్య అన్నదాన సత్రం మరెన్నో సంవత్సరాలు కొనసాగి మరింత మంది ఆకలి తీర్చాలని ప్రజలు ఆకాంక్షి స్తున్నారు.

# కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయామన్న భీమా నాయక్ తాండ నేతలు

**లింగాపూర్, జూన్ 12, ప్రభాతవార్త :**

లింగాపూర్ మండలంలోని బీమా నాయక్ తండా గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ పార్టీ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీని వీడారు. ఈరోజు ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవా లక్ష్మీ ్మ సమక్షంలో అధికారికంగా బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేసింది, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫల మైంది, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ్మ నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషికి పునర్అంకితం అవుతామనిఈ సందర్భంగా స్పష్టం చేశార. ఈకార్యక్రమంలో జాటోత్ రాహుల్, భీమ నాయక్ తండా గ్రామస్తులు, జాదవ్ గబ్బు ,జాదవ్ రాజశేఖర్ సర్పంచ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

Adb02:Adb02.qxd 6/12/2026 9:37 PM Page 1



# పార్టీ సభ్యత్వ నమోదు పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతుంది.....

**ఆసిఫాబాద్, జూన్ 12, ప్రభాతవార్త :**

బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమ్మేళనం, సభ్యత్వ నమోదు, సర్ శిక్షణ తరగతుల్లో మంచిర్యాల మాజీ జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతుందని తెలిపారు. డిజిటల్ నమోదు వల్ల సభ్యుడి పూర్తి




వివరాలు సులభంగా తెలుసుకునే వీలుంటుందని, దీని కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించామన్నారు. ఈ యాప్‌లో జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిల వారీగా సభ్యుల వివరాలతో పాటు బ్లడ్ గ్రూప్, పూర్తి చిరునామా కూడా నమోదు చేస్తామన్నారు. గతంలో పుస్తకాల ద్వారా సభ్యత్వ నమోదు జరిగేదని, దానివల్ల తప్పుడు నమోదులు జరిగేవని, ఈ నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్ ఉద్యమకారులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేయాలని నిర్ణయించారని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు వారి కుటుంబ సభ్యులందరూ తప్పనిసరిగా పార్టీ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, యువత, మహిళలందరితో సభ్యత్వ నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. నిజమైన ఓటర్లు, మృతి చెందినవారు, వలస వెళ్లిన వారిని గుర్తించి ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసి పక్కా ఓటర్ల జాబితాను రూపొందించడమే సర్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతోందని, ఆ ప్రభుత్వ వైఫల్యాలను, నెరవేర్చని హామీలను ప్రజల్లో ఎండగడుతూ పూర్తిస్థాయిలో పోరాడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, బూత్ లెవెల్ సభ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత

## ఎంజెపి భవన నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణ

## బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్





రాష్ట్రంలో విద్యాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండల కేంద్రంలో రూ.1.95 కోట్ల ఎస్.డి.ఎఫ్ నిధుల వ్యయంతో నిర్మించనున్న మహాత్మా జ్యోతిబా పూలే విద్యాలయం భవన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం గడ్డపారతో మట్టి తవ్వి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యేను శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఎం.జె.పి ఆర్.సి.ఓ బాల భాస్కర్, తహసిల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, ఎం.జె.పి ప్రిన్సిపాల్ వినోద్ కుమార్, సర్పంచ్ ముడిమడుగుల సురేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, మాజీ జెడ్పిటిసి సాలిగామ బానయ్య, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద బోయిన శంకర్, నాయకులు ఎండీ ఈసా, పెట్టెం విష్ణు కళ్యాణ్, ఎండి జుబేర్, శంకర్ గౌడ్, సుందిళ్ల భూమయ్య, వెంకట స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలి

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 12, ప్రభాతవార్త :**




పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట డిమాండ్లు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె హరితకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు చెల్లించేందుకు రూ.50 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణలోని 12,790 గ్రామ పంచాయతీల్లో సుమారు 53 వేల మంది సిబ్బంది, కార్మికులు గ్రామాల పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణ కోసం కీలక సేవలు అందిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా వంటి సంక్షేమ సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, 4 నెలల బకాయి వేతనాలను విడుదల చేయాలని, జీఓ నెం.51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీలను కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాడి మోరేశ్వర్, పెరక శ్రీకాంత్, జిల్లా కోశాధికారి గుండం శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు మోర్లే నగేశ్, జిల్లా సహాయ కార్యదర్శి పుష్పలత, దుర్గ, రమేష్ జిల్లా కమిటీ సభ్యులు భాగ్య, రాజమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# 15న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**కాగజ్‌నగర్, జూన్ 12: ప్రభాత వార్త :**

కాగజ్‌నగర్ మండల పరిధిలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన 239 చెక్కులను ఈ నెల 15న లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు అందజేయనున్నట్లు తహసీల్దార్ ఎం. మధుకర్ తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత లబ్ధిదారులు తప్పనిసరిగా తమకు సంబంధించిన ధృవీకరణ పత్రాలతో కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన సూచించారు. అవసరమైన పత్రాలను పరిశీలించిన అనంతరం చెక్కులను అందజేస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందిస్తున్న నేపథ్యంలో, మంజూరైన చెక్కులను సకాలంలో పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఆర్వో ఎం. మధుకర్ వెల్లడించారు.



# మహిళల స్వయం ఉపాధికి ఉచిత కుట్టు శిక్షణ

**కాగజ్‌నగర్, జూన్ 12, ప్రభాతవార్త :**

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కాగజ్‌నగర్ పట్టణంలో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. మహిళలు, యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ సుజాత, ఆర్‌పీ మాధవి, శిక్షకులు సవిత, వినోద, నాగమణి, కల్పన, దెబ్బటి శ్రీనివాస్, వసంత్‌తో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.



# గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించాలని కార్మికుల డిమాండ్

**కాగజ్‌నగర్, జూన్ 12, ప్రభాతవార్త :**

సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 24వ రోజుకు చేరుకున్నాయి. కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. దీక్షా శిబిరాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ముంజం ఆనంద్ కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఆర్. త్రివేణి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బోర్కుట్ రాజేందర్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కార్మికులకు తమ ప్రతినిధులను ఎన్నుకునే ప్రజాస్వామ్య హక్కు ఉందని, గుర్తింపు సంఘ ఎన్నికలను జాప్యం చేయడం కార్మిక హక్కులను కాలరాయడమేనని అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి వెంటనే గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించాలని యాజమాన్యం, కార్మిక శాఖ అధికారులను డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సీపీఎం, సీఐటీయూ, ప్రజాసంఘాల మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## నిర్మల్‌లో పేదలకు అండగా ప్రభుత్వం

### 40 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**నిర్మల్, జూన్ 12, ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు తెలిపారు. నిర్మల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన 40 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల 40 వేల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు, వైద్య చికిత్సలు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపశమనం కలిగిస్తోందని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ సహాయం కోసం దరఖాస్తుదారులు ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పథకాలు పూర్తిగా పారదర్శకంగా అమలయ్యేలా చూస్తున్నామని, అవసరమైన వారందరికీ సహాయం అందుతుందని భరోసా ఇచ్చారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, తమ సమస్యలను గుర్తించి సహాయం అందించిన కూచాడి శ్రీహరిరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో ఈ ఆర్థిక సహాయం తమకు ఎంతో తోడ్పాటునిచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



### మన బడి పండగ కరపత్రాలు ఆవిష్కరించిన ఎంఈఓ

**భైంసా, జూన్ 11, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన బడి పండగ కార్యక్రమంలో భాగంగా భైంసా పట్టణంలో గురువారం ప్రత్యేక కరపత్రాలను ఆవిష్కరించారు. భైంసా మండల విద్యాధికారి (ఎంఈఓ), ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడెల్లు శ్రీనివాస్, మన బడి పరిరక్షణ టీం చైర్మన్ సుంకేట మహేష్ బాబు చేతుల మీదుగా ఈ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సౌకర్యాలు, ఉచిత నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులు, రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ వంటి పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులలో అత్యుత్తమ విద్యాబోధన అందుతోందని, తల్లిదండ్రులంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. మన బడి పండగ కార్యక్రమం ద్వారా పట్టణంలోని ప్రతి గల్లీకి వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరుస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం సాయంత్రం 5:00 గంటలకు ప్రత్యేక గల్లీ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మన బడి టీం సభ్యులు రామోజీవార్, గంగప్రసాద్, అకోజీ పవన్ కుమార్, ముత్యం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



### జాం గ్రామంలో వేద పాఠశాల ప్రారంభం

**సారంగాపూర్, జూన్ 12, ప్రభాతవార్త:**
మండలంలోని జాం గ్రామంలో శుక్రవారం వేద మోడల్ స్కూల్ ను మాజీ సర్పంచ్ కరిపే రవళి, విలాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేక హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాలలో చేరిన చిన్న పిల్లల చేత సాంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం చేయించారు. ఆయా ప్రాంతాల విద్యార్థులకు సరైన, పటిష్టమైన ఆంగ్ల విద్యా బోధనను అందుబాటులోకి తీసుకురావాలనే ఉన్నత ఉద్దేశంతోనే ఈ పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## జెవిలి గ్రామంలో ముమ్మరంగా బడిబాట కార్యక్రమం

**సారంగాపూర్, జూన్ 12, ప్రభాతవార్త:**
మండలంలోని జెవిలి గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం ముమ్మరంగా సాగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూమేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కలిసి గ్రామంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ప్రతి ఇంటికీ తిరుగుతూ, అర్హులైన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ బడులలో చేరేలా వారిని ఒప్పించి, విద్యార్థుల పేర్లను నమోదు చేసుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం పాఠశాలల్లో ఎన్నో రకాల మౌలిక సౌకర్యాలు కల్పించి, ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన వసతి లాంటి సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామంలోని తల్లిదండ్రులంతా ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



### సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన శ్రీహరిరావు

**సారంగాపూర్, జూన్ 12, ప్రభాతవార్త:**
మండలంలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరిరావు అందజేశారు. శుక్రవారం నిర్మల్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. ఆర్థిక ఇబ్బందులు, వైద్య చికిత్సలు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే నిరుపేదల ఆరోగ్య నిమిత్తమై సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేయించి అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, మాజీ సర్పంచ్ భూమన్న, ముఖ్య నాయకులు సుభాష్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



### జాం గ్రామంలో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసిన కార్మికులు

**సారంగాపూర్, జూన్ 12, ప్రభాతవార్త:**
మండలంలోని జాం గ్రామంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులు పలు మంచినీటి వాటర్ ట్యాంకులను క్షుణ్ణంగా శుభ్రం చేశారు. రాబోయేది వర్షాకాలం కావడంతో ట్యాంకులు అపరిశుభ్రంగా ఉంటే, వాటిలోని నీరు తాగి ప్రజలు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందనే ముందస్తు ఆలోచనతో మాజీ సర్పంచ్ కరిపే రవళి పంచాయతీ సిబ్బందితో ఈ పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ విధంగా మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడిన వారమవుతామన్నారు. వర్షాకాలంలో గ్రామీణ ప్రజలు తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు విలాస్, పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 33 కేవీ లైన్ మరమ్మత్తులు.. నేడు విద్యుత్ అంతరాయం

**వేమనపల్లి, జూన్ 12, ప్రభాతవార్త**
33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మత్తు పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేమనపల్లి, నీల్వాయి 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్ తెలిపారు. నీల్వాయి, కేతనపల్లి, వేమనపల్లి, సుంపుటం, గొర్లపల్లి, రాచర్ల, దస్నాపూర్,రాజారాం తదితర గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొంటూ, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## వైద్య విద్యార్థులకు ఆరోగ్య సేవలపై అవగాహన కార్యక్రమం

**మంచిర్యాల, జూన్ 12, ప్రభాతవార్త**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్య కళాశాల విద్యార్థులకు వైద్య ఆరోగ్యశాఖ మరియు దాని అనుబంధ సంస్థలు అందిస్తున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ పరిధిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు విధానం, ఆరోగ్య రంగంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, వాటికి అనుబంధంగా పనిచేస్తున్న వైద్యులు అందిస్తున్న సేవలు, ప్రజారోగ్య పరిరక్షణలో వారి పాత్రపై కూడా అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.డి. రషీద్ మాట్లాడుతూ ఆరోగ్య శాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న వైద్య సేవలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల సిబ్బంది శ్రీనివాస్, వైద్య విద్యార్థులు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



### ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

**వేమనపల్లి, జూన్ 12, ప్రభాతవార్త**
సుంపుటం గ్రామ పంచాయతీ పరిధిలోని జాజులపేట గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి కూలీలకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు హాజరై ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలకు ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుబిడే కిష్టయ్య, టీపీ కృష్ణమోహన్, ఫీల్డ్ అసిస్టెంట్ మానేపల్లి సంజీవ్, కుబిడే నానేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# పుస్తకాలు, దుస్తుల బలవంతపు విక్రయాలు నిలిపివేయాలి

## జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘం నిరసన

**మంచిర్యాల, జూన్ 12, ప్రభాతవార్త**



జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నాయని నవతరం విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ ఆరోపించారు. శుక్రవారం జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందజేయడానికి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వచ్చిన నవతరం విద్యార్థి సమాఖ్య నాయకులు, జిల్లా విద్యాశాఖలో శాశ్వత అధికారి లేకపోవడంతో తమ సమస్యలను వినిపించుకునే అవకాశం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి చూసినా సంబంధిత అధికారి అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నీరటి రామ్ ప్రసాద్ పటేల్ మాట్లాడుతూ, జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠ్యపుస్తకాలు, పాఠశాల దుస్తులు తమ వద్దే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులను బలవంత పెడుతున్నాయని ఆరోపించారు. వందల రూపాయల విలువ చేసే వస్తువులను వేల రూపాయలకు విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అంశంపై అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు వచ్చినప్పటికీ, జిల్లాలో శాశ్వత జిల్లా విద్యాశాఖ అధికారి లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. వెంటనే జిల్లాకు శాశ్వత జిల్లా విద్యాశాఖ అధికారిని నియమించి, విద్యాసంస్థల్లో జరుగుతున్న రుసుముల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పట్టించుకోని పక్షంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నవతరం విద్యార్థి సమాఖ్య జిల్లా కన్వీనర్ జాబు ఆశిష్ కుమార్, అక్షిత్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మాటిచ్చిన 36 రోజుల్లోనే గూడెం దేవస్థానం అభివృద్ధి పనులకుశ్రీకారం

- ముఖ్యమంత్రి హామీతో రూ.70 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**మంచిర్యాల, జూన్ 12, ప్రభాతవార్త**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించిన కేవలం 36 రోజుల్లోనే శంకుస్థాపన కార్యక్రమం చేపట్టడం గర్వకారణమని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శుక్రవారం తన నివాసంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరుకానున్నారని చెప్పారు. పిప్పిరి సభలో తన విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవస్థానం అభివృద్ధికి రూ.70 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం నిధులు విడుదల చేసి పనులకు శ్రీకారం చుడుతున్నారని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సింగరేణి ప్రాంత ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు సింగరేణి కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగ నియామక పత్రాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంచిర్యాలలో అందజేయనున్నట్లు వెల్లడించారు. పెద్ద సంఖ్యలో సింగరేణి కార్మికుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభించడం సంతోషకరమని అన్నారు. అనంతరం శ్రీరాంపూర్ సింగరేణి గనుల ప్రాంతాన్ని సందర్శించి, మంచిర్యాల పట్టణంలోని శ్రీ విశ్వనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని పద్మావతి గార్డెన్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన శిక్షణ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొంటారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మేయర్ ధర్ని మధుకర్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కార్పొరేటర్లు, నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

## జూన్ 21 యోగా మహోత్సవానికి సర్వత్రా ఆహ్వానం

### యోగా బృందాలు పేర్లు నమోదు చేసుకోవాలి యోగా గురువులు

**మంచిర్యాల, జూన్ 12, ప్రభాతవార్త**



ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ఓం అష్టోత్తర యోగా పీట్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు, విద్యార్థులు, మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని యోగా గురువులు గుండా విజయ్ కుమార్ ఆర్య, శ్రీనివాసరెడ్డి, ముక్త వేణుగోపాల్ ,కోడూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి మూలాధారమని పేర్కొన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవన విధానంలో యోగ ప్రతి ఒక్కరికి అవసరమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సామూహిక యోగా ప్రదర్శనలు, ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యోగా దినోత్సవంలో పాల్గొనదలచిన యోగా బృందాలు, యోగా సంస్థలు, యోగా శిక్షకులు తమ పేర్లను ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అందుకు నిర్వాహకులు అందుబాటులో ఉంచిన సంప్రదింపు సంఖ్యకు ఫోన్ చేసి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఓం అష్టోత్తర యోగా పీఠ్ సభ్యులు యోగా దినోత్సవం కోసం ప్రత్యేక సాధన కార్యక్రమాలు నిర్వహిస్తూ సన్నద్ధమవుతున్నారని చెప్పారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమానికి హాజరై యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు, శిక్షకులు, ఓం అష్టోత్తర యోగా పీఠ్ సభ్యులు పాల్గొన్నారు.

# బీరన్న ఆలయ నిర్మాణానికి ముస్లిం నేత విరాళం

**తాండూర్, జూన్ 12, ప్రభాతవార్త :**

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న బీరన్న దేవుడు ఆలయానికి ముస్లిం మైనార్టీ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మహమ్మద్ ఈసా రూ. 5,000 విరాళంగా అందజేశారు. మత సామరస్యానికి ప్రతీకగా ఆయన ఈ విరాళాన్ని ఆలయ నిర్వాహకుడు పర్వతాలు, మల్లేష్ కు అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మహమ్మద్ ఈసా సేవా భావాన్ని అభినందించారు. మతాలకు అతీతంగా సమాజ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు పేర్కొన్నారు.



# సారంగపల్లి అటవీ ప్రాంతంలో

## గుర్తుతెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యం

## మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం

## దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**మందమర్రి, జూన్ 12, ప్రభాతవార్త**

మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపల్లి అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తికి చెందిన అస్థిపంజరం లభ్యమవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సారంగపల్లి గ్రామానికి చెందిన మేకల కాపరి కేశవగేని బాలయ్య శుక్రవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో తన మేకలను మేపేందుకు గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. ఈ క్రమంలో అడవిలో ఓ వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి అస్థిపంజరంగా మారిన స్థితిలో కనిపించడంతో అతడు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యాడు. వెంటనే ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ బచ్చలి రాములు దృష్టికి తీసుకెళ్లాడు. సమాచారం అందుకున్న సర్పంచ్ బచ్చలి రాములు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పుప్పాల సవ్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ మృతదేహానికి చెందిన తల పుర్రె, చేతులు, కాళ్ల ఎముకలు మాత్రమే మిగిలి ఉండగా, మృతదేహం సమీపంలో లేత నీలం రంగు ప్యాంటు, దానికి బెల్టు ఉన్నట్లు గుర్తించారు. శరీరంపై మాంసం, చర్మం పూర్తిగా లేకపోవడంతో అడవి జంతువులు మృతదేహాన్ని పీక్కుతిన్న అవకాశాలు ఉన్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై గ్రామ పంచాయతీ కార్యదర్శి పుప్పాల సవ్య మందమర్రి పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతుడు ఎవరు? ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి? ఎంతకాలం క్రితం మృతి చెందాడు? అనే కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. అలాగే సంఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్, పోలీసు ఉన్నతాధికారులు సందర్శించి ఆధారాలు సేకరిస్తున్నారు. అస్థిపంజరాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, గుర్తింపు కోసం సమీప పోలీస్ స్టేషన్లలో నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.

# కోనేరు అన్నదాన సత్రంలో చిన్నారుల సందడి....

**కాగజ్‌నగర్, జూన్ 12, ప్రభాతవార్త :**

కోనేరు నిత్య అన్నదాన సత్రంలో చిన్నారులు సేవా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అన్నదానానికి వచ్చిన నిరుపేదలు, వృద్ధులు, బాటసారులకు చిన్నారులు స్వయంగా అన్నం వడ్డిస్తూ సేవాభావాన్ని చాటుకున్నారు. పెద్దలతో కలిసి భోజనం వడ్డించడం, వచ్చిన వారిని ఆత్మీయంగా పలకరించడం ద్వారా చిన్న వయస్సులోనే మానవతా విలువలను అలవర్చుకుంటున్నారని పలువురు అభినందించారు. సేవ చేయడం గొప్ప సంస్కారమనే భావనను చిన్నారుల్లో పెంపొందించాలనే ఉద్దేశంతో వారిని అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములను చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నదానం కేవలం ఆకలి తీర్చడమే కాకుండా ప్రేమ, దయ, సేవాగుణాలను పంచే మహోన్నత కార్యక్రమమని పేర్కొన్నారు. చిన్నారులు ఆనందంగా సేవ చేయడం చూసిన పలువురు భక్తులు, స్థానికులు వారిని అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చిన్నారుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని కోరారు.



